
కథ

# ఎదురైన రహస్యం

ముకుంద



సౌండ్ హఠాత్తుగా పెరిగింది.. సన్నటి వెలుతురులో నున్నటి శరీరాలు మెరుస్తున్నాయి..ఆడుతున్నాయి..

"సౌండ్ తగ్గించమను.. ఒక్క మాట కూడా వినబడటం లేదు" అన్నాడు ఆదిత్య.


" మనం పబ్‌కి వచ్చింది ఈ మాత్రం సౌండ్‌లో ట్యూన్ వినడానికి.. డ్యాన్స్ చేయటానికి.. యోగా చేయటానికైతే పార్క్‌కి వెళ్తే సరిపోయేది కదా! " అని కిసుక్కున నవ్వాడు శర్మ.

మాధవ మాత్రం ఏం మాట్లాడకుండా డ్యాన్స్ చేస్తున్న వాళ్లనే చూస్తున్నాడు. ఆదిత్య, మాధవ, శర్మ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. కంపెనీలో ఒకే సారి చేరారు. ఒకేసారి ముగ్గురికి ప్రమోషన్లు వచ్చాయి. ముగ్గురు ఒకే ప్రాజెక్టు కోసం అమెరికాకి వెళ్లి వచ్చారు. ముగ్గురు ఒకే ఫ్లాట్ తీసుకొని ఉంటున్నారు. అలాంటిది శర్మ, మాధవ్‌లను బెంగుళూరుకు ఒక ప్రాజెక్టు కోసం పంపాలని మేనేజిమెంట్ నిర్ణయించింది. ఆదిత్యను మాత్రం హైదరాబాద్‌లోనే కొద్ది కాలం ఉంచుతామని ప్రాజెక్టు మేనేజర్ చెప్పాడు. ఆదిత్య తను కూడా బెంగుళూరు వెళ్తానని గట్టిగా పోట్లాడాడు. మేనేజర్ మాత్రం ససేమిరా అన్నాడు. మర్నాడే ఇద్దరి ప్రయాణం. ముందు రోజు ఎంజాయ్ చేయాలని పబ్‌కి వచ్చారు.

"బాస్! మీ ఇద్దరిని మిస్

అయిపోతా!'' అన్నాడు ఆదిత్య.

''అబద్ధం.. అంతా అబద్ధం.. మేము లేకపోతే నువ్వు రాగిణితో సెటిలయిపోదామనుకుంటున్నావు'' అన్నాడు శర్మ కొద్దిగా గట్టిగా. ఖాళీ గ్లాసు గట్టిగా



టేబుల్ మీద కొట్టాడు. అప్పటికి అతనికి అది ఐదో రౌండ్.. ''ప్రామిస్..రాగిణి మీ చెల్లి లాంటిది..అస్సలు మీ గురించి ఏం చెప్పను'' అన్నాడు ఆదిత్య.

''చూసావా! తాగితే అందరూ నిజం చెబుతారు.. ఈ వేస్ట్‌ఫెలో మాత్రం రాగిణిని మన చెల్లి అంటున్నాడు'' అంటూ వెనక్కి తిరిగాడు మాధవ. తిరిగిన వాడు తిరిగినట్లే ఉండిపోయాడు. ఏ సౌండ్ రాకపోయేసరికి మాధవ కేసి తిరిగారు శర్మ, ఆదిత్య.

''వావ్! ఏం ఫిగర్.. చేస్తే ఆ ఫిగర్‌తోనే డ్యాన్స్ చేయాలి..'' అన్నాడు మాధవ- దూరంగా ఓ అమ్మాయిని చూస్తూ. శర్మ, ఆదిత్యల్లో ఉత్సాహం పెరిగింది.

''ఏ ఫిగర్ గురూ'' అడిగాడు ఆదిత్య.

''ఎంతైనా హైదరాబాద్ అమ్మాయిలు కత్తి గురూ.. పెళ్లి చేసుకుంటే ఇక్కడ వాళ్లనే చేసుకోవాలి'' అన్నాడు శర్మ. ఇంతలో బీటు మారింది. డ్యాన్స్ స్టైల్ మారింది. మాధవ దృష్టి డ్యాన్స్ ఫ్లోర్‌ను వదలటం లేదు.

''ఎవరు గురు.. అంత గొప్ప ఫిగర్.. నాకు చూపించు.. మాట్లాడేస్తా'' అన్నాడు శర్మ. కుర్చీలో నుంచి లేవబోయాడు. మళ్లీ కూర్చుండిపోయాడు.

'' సస్పెన్స్.. నా డ్రీమ్ గర్ల్..నా కళ్ల ముందు డ్యాన్స్ చేస్తోంది. ఆ అమ్మాయే నాకు కావాలి..ఇంకెవ్వరూ వద్దు..'' అన్నాడు మాధవ.



ఆదిత్య ఏం మాట్లాడ లేదు. అతని కళ్లు మాత్రం మాధవ చెప్పిన ఫిగర్ కోసం వెతుకుతున్నాయి. మాధవది అమ్మాయిల విషయంలో చాలా మంచి టేస్ట్. ఆ సంగతి శర్మ, ఆదిత్యలకు తెలుసు. మాధవ అంత మనసు పడుతున్నాడంటే ఆ అమ్మాయి చాలా అందగత్తె అయి ఉండాలి. శర్మ కుర్చీని ముందుకు లాగాడు. మాధవ దగ్గరగా వేసుకున్నాడు.

''అదిగో.. నా ఫిగర్ అదే..'' అన్నాడు మాధవ్. వేలు పెట్టి చూపించాడు. శర్మ ఆ వైపు చూశాడు.

''నీ టేస్ట్ సూపర్ బాస్! వెళ్లి మాట్లాడతా..'' అన్నాడు శర్మ.

''ఎక్కడా..నాకు చూపించు'' అన్నాడు ఆదిత్య. మాధవ, శర్మ- ఇద్దరూ నవ్వారు.

''ఈ వేస్ట్ ఫెలోకి ఇలా కావాల్సిందే.. రాగిణిని పట్టుకుపోదామనుకుంటున్నాడు.. మనం ఈ ఫిగర్‌తో సెటిలైపోదాం'' అన్నాడు మాధవ. డ్యాన్స్ ఫ్లోర్ మీద ఎంతో మంది అమ్మాయిలు ఉన్నారు. అందులో తనకు కనబడకుండా- శర్మ, మాధవలకు కనిపిస్తున్న ఆ ఫిగర్ అంటే మరింత ఆసక్తి పెరిగిపోతోంది.

''బ్యూటిఫుల్.. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఫిగరే దొరకలేదు.. అన్నా.. వదలకూడదు'' అన్నాడు శర్మ.

''మీకు బాగా ఎక్కువైంది.. అందుకే నాకు కనిపించని ఫిగర్ మీకు కనిపిస్తోంది'' అన్నాడు ఆదిత్య కొంత ఉక్రోషంగా.

''నా కళ్లు నువ్వు తగిలించుకొని చూడు.. అప్పుడు ఆ ఫిగర్ అందమేమిటో తెలుస్తుంది'' అన్నాడు మాధవ. ''ఇప్పుడే వస్తా '' అని లేచాడు డ్యాన్ ఫ్లోర్ మీదకు వెళ్దామని. మళ్లీ బీట్ మారింది. గుంపు చెదిరింది. భంగ్రా జోరుగా సాగుతోంది. మాధవ మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు. ముగ్గురి కళ్లు డ్యాన్స్ ఫ్లోర్ మీద ఫిగర్ గురించి వెతుకుతున్నాయి.

''ఒక్క నైట్ గురు.. చాలు.. ఈ పాడు జీవితానికి.. అలాగే చచ్చిపోతా.. '' అని పలవరిస్తున్నాడు శర్మ. హఠాత్తుగా లైట్లు ఆరిపోయాయి. ఒక్క క్షణంలో మళ్లీ వెలిగాయి.

''అదిగో.. ఇప్పుడే చూసా..'' అని ముందుకు ఉరికాడు మాధవ. ఇంతలో మళ్లీ బీట్ మారింది. అబ్బాయిల చేతిల్లో చిక్కుకున్న అమ్మాయిల నడుములు



ఊగుతున్నాయి. మళ్లీ మరో రాత్రి రాదన్నట్లు అందరూ డ్యాన్స్ చేస్తున్నారు. కొందరు దీక్ష పట్టినట్లు సిగరెట్టు మీద సిగరెట్టు కాల్చేస్తున్నారు. వాళ్ల చేతుల్లో సిగరెట్లు ఎర్రని కాగడాల్లా వెలుగుతున్నాయి.

''నేనింక ఉండలేను.. వెళ్దాం..'' అని లేచాడు శర్మ. మాధవ, ఆదిత్య ఇద్దరు అతనిని ఫాలో అయ్యారు. డ్యాన్స్ ఫ్లోర్ మధ్య నుంచి బయటకు వెళ్లటానికి అడుగులు వేయటం మొదలుపెట్టారు. ఏసీ ఫ్లోర్‌లో ఒక పక్క ఆల్కహాల్ వాసన. మరో వైపు చెమట వాసన. పబ్ డోర్ తీసి బయటకు వచ్చేసరికి చల్లటి గాలి మొహానికి జల్లున తాకింది. ఒక్క సారి ముగ్గురికి వళ్లు జలదరించింది. బయటంతా ప్రశాంతంగా ఉంది. ఆదిత్య కారు వైపు ముగ్గురు నెమ్మదిగా నడవటం మొదలుపెట్టారు.

''మొత్తానికి ఆ ఫిగర్‌ను నే చూడనే లేదు.. మీరు చూపించలేదు'' అన్నాడు ఆదిత్య కొంత నిష్ఠూరంగా.

''వద్దు గురూ.. ఆ ఫిగర్ గురించి మాట్లాడు.. వళ్లు వేడెక్కిపోతోంది'' అన్నాడు శర్మ. ముగ్గురు కార్లో కూర్చున్నారు.

''మీకు సాయంత్రం ట్రైన్. నే మాత్రం ఉదయాన్నే లేవాలి. మా అమ్మ, నాన్న వస్తున్నారు.. పెళ్లి చూపులట'' అన్నాడు ఆదిత్య.

''అరే.. కంగ్రాట్స్.. మంచి ఫిగర్స్ ఉంటే చెప్పు.. మేం కూడా పెళ్లి చేసేసుకుంటాం'' అన్నాడు మాధవ.

''షటప్..నేను వెళ్లేది పెళ్లి చూపులకు.. '' అని ఇంకా ఏదో అనబోయి ఆపేశాడు ఆదిత్య. ఇంతలో ఇల్లు వచ్చింది. ఆదిత్య ఫ్లాట్ తలుపుతీశాడు. ముగ్గురు రూమ్‌లలోకి వెళ్లిపోయారు. ఆదిత్య బట్టలు మార్చుకొని పడుకున్నాడు. పక్క రూమ్‌లో నుంచి మాధవ, శర్మల మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

''మనకా అదృష్టం లేదు.. కాని ఆ ఫిగరు..''- అలా మాటలు వింటూ ఆదిత్య నిద్రపోయాడు.

***

ఉదయాన్నే ఆదిత్య అమ్మా,నాన్న వచ్చారు.

''అమ్మాయి ఫోటో చూడకుండా పెళ్లి చూపులకు వెళ్లటం ఎలా డాడీ! మీ చాదస్తం తప్పితే.. అందరూ ఫోటోలు ఇస్తున్నారు కదా.. మీరెందుకు పుచ్చుకోరు.. ఫోటో చూస్తే వాళ్లకి శ్రమ తప్పుతుంది.. మనకీ తప్పుతుంది'' కోపంగా అన్నాడు ఆదిత్య.

''మనం టీవీనో.. స్కూటరో కొనుక్కోవటం లేదు.. ఒక అమ్మాయిని చూస్తున్నాం..లక్షణంగా అమ్మాయినే చూడచ్చుగా.. లైఫ్ లేని ఫోటోలెందుకు'' అని తిప్పికొట్టాడు ఆదిత్య వాళ్ల నాన్న.

పెళ్లి మీద ఆదిత్యకు చాలా ఆశలు ఉన్నాయి. వచ్చే అమ్మాయి అందంగా లేకపోయినా ఆకర్షణీయంగా ఉండాలని.. అమ్మాయి వెళ్తుంటే అందరూ కళ్లప్పగించి ఆ అమ్మాయినే చూసేటంత అందంగా ఉండాలని.. మంచి శరీర సౌష్టవం ఉండాలని.. ఇలాంటి ఆలోచనలు ఎన్నెన్నో. తల్లిదండ్రుల బలవంతం మీద పెళ్లి చూపులకు ఒప్పుకున్నాడు. కాని ప్రేమించి.. ప్రేమలో ఉన్న మాధుర్యాన్ని చవిచూసి అప్పుడే పెళ్లి చేసుకోవాల

నేది ఆదిత్య కోరిక. ముందుగా పెట్టుకున్న ముహుర్తం ప్రకారం- మధ్యాహ్నం మూడుగంటలకు పెళ్లి చూపులకు అమ్మానాన్నలతో బయలుదేరి వెళ్లాడు ఆదిత్య. పెళ్లి కూతురిని చూడగానే ఆదిత్య వళ్లు ఝల్లుమంది. పేరు రమ్య. అతను ఎలాంటి అమ్మాయి కావాలనుకున్నాడో రమ్య అచ్చం అలాగే ఊహల నుంచి నేల మీదకు నడిచి వచ్చినట్లుంది. ఇక ముందు వెనక ఆలోచించకుండా ఓకే చెప్పేశాడు ఆదిత్య. పదిహేను రోజుల్లో ముహూర్తాలు కూడా పెట్టేసుకున్నారు. సాయంత్రం తనకు పెళ్లికుదిరిన విషయాన్ని ట్రైన్‌లో ఉన్న మాధవ, శర్మలకు చెప్పాడు ఆదిత్య. పదిహేను రోజుల్లో ముహూర్తమంటే రాలేమన్నారు ఇద్దరూ. తప్పకుండా ట్రై చేస్తామని ప్రామిస్ చేశారు. రోజులు వేగంగా సాగిపోతున్నాయి. పెళ్లిపనులు కాలంతో పరుగులు తీస్తున్నాయి. పెళ్లిరోజు వచ్చేసింది. చాలా వైభవంగా పెళ్లి జరిగింది. ఇక మిగిలింది తొలి రేయి..

***

ఫస్ట్‌నైట్‌కు సంబంధించి ఆదిత్యకు కొన్ని కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఫస్ట్‌నైట్ పున్నమి రోజే జరగాలనేది దానిలో మొదటిది. అదృష్టవశాత్తు పున్నమి వెళ్లిన మర్నాడు ముహూర్తం కుదిరింది. ఉదయం నుంచి ఆదిత్యకు ఒకటే టెన్షన్. సాయంత్రం అవుతున్న కొద్ది మరింత పెరిగింది. కట్టలు తెంచుకొనే పరిస్థితి ఏర్పడింది. శర్మ, మాధవలకు ఫోన్ చేశాడు.

"కంగ్రాట్స్! అంతా అయిపోయిందా" అని ఫోన్‌లో గట్టిగా అరిచాడు శర్మ.

"షటప్.. ఏంటి అయ్యేది..ఒక పక్క టెన్షన్ భరించలేకపోతున్నా.." అన్నాడు ఆదిత్య.

"అదే గురూ.. ఒక్క సారి అయిపోతే టెన్షన్ అంతా పోతుంది కదా..అందుకేగా ఫస్ట్‌నైట్.." అన్నాడు శర్మ.

"నీకో అడ్వైజ్.." అంటూ కొనసాగించాడు. "ఎక్కువ ఆత్రం వద్దు. మొదటికే మోసం వస్తుంది. జాగ్రత్తగా ఉండూ..ఎక్కడా ఎమోషనల్ అవకు.." ఇలా చెప్పటం మొదలెట్టాడు.

"శర్మ! ప్లీజ్.. నేనేదో టెన్షన్‌లో ఉండి ఫోన్ చేస్తే.. నువ్వు ఇంకా పెంచేస్తున్నావు.. మాధవ ఉంటే ఇవ్వు.." అన్నాడు ఆదిత్య.

"మాధవ లేడు కానీ.. ఈ రోజు రాత్రి ప్రోగ్రాం గురించి చెప్పు" అని చాలా అమాయకంగా అడిగాడు శర్మ. అంత టెన్షన్‌లోను ఆదిత్యకు నవ్వు వచ్చింది.

"సరే కాని శర్మ.. చాలా టెన్షన్‌గా ఉంది గురూ.. ఏం చేయాలో అర్థం కావటం లేదు" అన్నాడు ఆదిత్య.

"అదే చేయి.." ఓ ఉచిత సలహా పారేశాడు శర్మ. ఇంతలో లోపలి నుంచి ఆదిత్యను ఎవరో పిలిచారు.

"ఓకే శర్మ.. మళ్లీకాల్ చేస్తా" అని పెట్టేయబోతుంటే- "నేనే కాల్ చేస్తా.. రాత్రి 11.30కి.." అన్నాడు శర్మ.

" షటప్.. " అని ఫోన్ పెట్టేశాడు ఆదిత్య.

రాత్రి అనుకున్న సమయం కన్నా ముందే వచ్చేసినట్లు అనిపించింది ఆదిత్యకి. రాత్రి ఎనిమిదిన్నర అయింది. ఇళ్లంతా హడావిడిగా ఉంది. రమ్య తయారవుతోంది. లైట్ల వెలుతురులో ఆమె శరీరం మెరుస్తోంది.. కట్టుకున్న పచ్చని పట్టు చీర.. శరీరం రంగుకు చీర రంగుకు మధ్య ఉన్న తేడాను చెప్పకనే చెబుతోంది. నుదుటిన కళ్యాణ తిలకం.. మెడలో పచ్చల హారం.. నుదుట మీద పడుతున్న చిన్న పాపిడ.. జడలో పూలు.. రమ్య నిజంగా రతీదేవిలాగే ఉంది. "ముహూర్తం దాటిపోతుంది.. ముందు పూజ కానివ్వండి.." అంటూ ఇంట్లో పెద్ద వాళ్లు హడావిడి పడిపోతున్నారు. పురోహితుడు వచ్చి టీవీ చూస్తూ కూర్చున్నాడు. ఆదిత్య టెన్షన్‌ను చూసి నవ్వాడు.

"బాబూ.. నీకు కొత్త కాని.. నాకు కాదుగా" అన్నాడు పలకరింపుగా.

అదేం పిచ్చి పలకరింపు అనుకున్నాడు ఆదిత్య. మొత్తానికి పూజ అయిపోయింది. ఆదిత్యకు టెన్షన్ హిమాలయాలంత ఎత్తు పెరిగిపోయింది. రమ్య బెడ్ రూమ్‌లోకి వచ్చింది. తలుపు వేసింది.

"ఈ రోజు చాలా ఉక్కగా ఉంది.." అంది. ఉలిక్కి పడి చూశాడు ఆదిత్య.

"అదేంటి ఫస్ట్ నైట్ వెదర్ గురించి చెబుతున్నావు.. అందరూ 'అలా మాట్లాడుకోరు కదా..' అన్నాడు ఆదిత్య. "బహుశా నువ్వు తెలుగు, తమిళ, మళయాల సినిమాలు ఎక్కువ చూస్తావేమో.. కాళ్ల మీద పడటం.. కాళ్లు కాళ్లు రాసుకోవటం.. నిజ జీవితంలో అలా ఉండవు.. " అని నర్మగర్భంగా నవ్వింది రమ్య.

"సినిమాఅయినా.. జీవితమైనా.. ఒకటి మాత్రం నిజం.." ఆగాడు ఆదిత్య.

> ఫస్ట్‌నైట్‌కు సంబంధించి ఆదిత్యకు కొన్ని కచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఫస్ట్‌నైట్ పున్నమి రోజే జరగాలనేది దానిలో మొదటిది.

"ఫస్ట్ టైమ్ అనుభూతికి తిరుగు ఉండదు.."అన్నాడు. ఆదిత్య మోహంలో టెన్షన్ చూసి రమ్య నవ్వింది. ఆదిత్య కొంచెం ముందుకు జరిగాడు. కొంచెం సంకోచంగా రమ్య చేతి మీద చేయి వేశాడు. రమ్య ఆదిత్య కళ్లలోకే చూస్తోంది. ఒక సారి చెయ్యి వెనక్కి తీసేశాడు. రమ్య నవ్వింది. ఈ సారి కొంచెం ధైర్యం పుంజుకున్నాడు. రమ్య భుజం మీద చేయి వేశాడు.

"ధైర్యం వచ్చిందా.." అని కొంచెం చిలిపిగా నవ్వింది రమ్య.

ఇంకొద్దిగా ముందుకు జరిగాడు ఆదిత్య. ఇద్దరి శరీరాలు కొద్దిగా దగ్గరయ్యాయి. రమ్య నుదుటి మీద చిరుచెమట పట్టింది. ఆదిత్య సన్నగా నవ్వాడు. రమ్య మొహాన్ని చేతులలోకి తీసుకున్నాడు. కొంచెం దగ్గరగా లాగాడు. రమ్య మోహంలో చిరు భయంతో కూడిన ఆసక్తి. ఆదిత్య మరింత దగ్గరకు చేరాడు. ఈసారి అతని చేతులు ఆమె నడుం మీదకు వెళ్లాయి. ఉదయం నుంచి ఆదిత్యలో పేరుకు పోయిన ఒత్తిడి ఒక్కసారి భళ్లున బద్దలయింది. చిత్రమైన చిలిపి అనుభూతి. వెచ్చని వెన్నెలలో చల్లటి చెరువులో స్నానం చేస్తున్న అనుభూతి. వేల అడుగుల ఎత్తు ఉన్న పెద్ద కొండల మీద నుంచి అందమైన లోయలోకి మెత్తగా పడిన అనుభూతి. కొంచెం చీకటి.. కొంచెం వెలుతురు..కొంచెం తృప్తి..మొత్తానికి అది మనసును పూర్తిగా లాలించి పాలించిన ఓ కల..

***

మూడు రోజులు మూడు క్షణాల్లా గడిచిపోయాయి రమ్య, ఆదిత్యలకు. హైదరాబాద్‌లో ముందుగా చూసి పెట్టుకున్న ఫ్లాట్‌లోకి దిగిపోయారు కొత్త దంపతులు. కొత్త ఫ్లాట్‌లోకి దిగిన మర్నాడు ఉదయం శర్మ, మాధవల దగ్గర నుంచి ఫోన్ వచ్చింది.

"బాస్.. మూడు రోజుల నుంచి దొరకటం లేదు.. ఎప్పుడూ స్విచ్ఛ్ ఆఫ్ వస్తోంది.. ఏం చేస్తున్నావు? " అమాయకంగా అడిగాడు శర్మ.

"రోజు టిఫెన్ చేసి.. కాఫీ తాగి.. భోజనం చేస్తున్నా.." అన్నాడు ఆదిత్య వెటకారంగా.

"ఇంకా.. " రెట్టించాడు శర్మ.

"ఎలా ఉన్నారు.. మాధవ్ ఉంటే ఇయ్యి.." అన్నాడు ఆదిత్య.

"బాస్! మీ ఇంటి దగ్గరే ఉన్నాం. నువ్వు రమ్మన్నావు కదా.. అందుకే టిఫిన్ చేయటం కోసం మీ ఇంటికే వచ్చేస్తున్నాం" అన్నాడు శర్మ. ఆదిత్యకి ఎందుకో చాలా ఆనందంగా అనిపించింది. ఆదిత్య సరే అని ఫోన్ పెట్టేలోపులోనే శర్మ, మాధవలు ఇంటి గుమ్మంలో ప్రత్యక్షమయ్యారు.

" విష్ యూ హ్యాపీ మ్యారీడ్ లైఫ్" అంటూ ఆదిత్యను కౌగిలించుకున్నారు. అందరూ ఇంటిలోపలికి వెళ్లి మాట్లాడుకోవటం మొదలుపెట్టారు.

" నా వైఫ్ రమ్యను పిలుస్తా.. " అంటూ లోపలికి వెళ్లాడు ఆదిత్య. నా క్లోజ్ ఫ్రెండ్స్.. ఒకే కంపెనీ.. ఒకే రూమ్‌లో ఉన్నాం.. ప్రాజెక్టు వల్ల రాలేకపోయారు అంటూ రమ్యను తీసుకువచ్చి పరిచయం చేశాడు ఆదిత్య. శర్మ, మాధవ మోహాలలో కొద్దిగా రంగులు మారాయి. ఇద్దరు రెండు క్షణాలు ఏం మాట్లాడలేదు. రమ్య వాళ్లిద్దరి మోహాలలోకి ఆసక్తిగా చూస్తోంది. ముందు మాధవ తేరుకున్నాడు.

"చెల్లెమ్మ చాలా బావుంది ఆదిత్య.." అన్నాడు.

ఆదిత్యకు షాక్ కొట్టినట్టయింది. ఏ అమ్మాయినైనా మాధవ చెల్లి అని పిలవటం ఆదిత్యకు తెలిసి తొలిసారి.

" ఏం శర్మ.. నువ్వేమంటావు" అన్నాడు మాధవ.

"అవును.. బావుంది.." అన్నాడు శర్మ. అతనిలో ముందటి ఉత్సాహం లేదు.

" అరే.. మీ ఇద్దరికి ఏమయింది.. హఠాత్తుగా సైలెంట్ అయిపోయారు" అన్నాడు ఆదిత్య. మాధవ ఏదో అనబోతుంటే- రమ్య కాఫీ తీసుకువచ్చింది.

"మీ ఇద్దరిని ఎక్కడో చూశా.. నాకు బాగా తెలుసు.." అంది రమ్య.

"మాకు తెలీదు.." అన్నారు ఇద్దరూ కోరస్‌గా. ఆదిత్యకు ఏం అర్థం కాలేదు. కాఫీ తాగి వేరే పనుందంటూ ఇద్దరు వెళ్లటానికి లేచారు. టెన్షన్‌గా ఉన్న వాతావరణాన్ని చల్లబరచటానికన్నట్లు..

"ఆ రోజు పబ్‌లో చూశామే.. ఆ పిగర్.." అని ఆదిత్య ఏదో అనబోయాడు. శర్మ, మాధవలు ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు.

" వదిలేయ్ గురూ.. నీకు పెళ్లి అయిపోయింది... పబ్‌లు.. ఫిగర్ల గురించి మర్చిపో.. చెల్లెమ్మ చాలా అందంగా ఉంది.." అన్నాడు మాధవ. ఆదిత్య ఇంకో మాట మాట్లాడకముందే.. ఎవరో తరుముకు వస్తున్నట్లు బయటకు వెళ్లిపోయారు. ఆ తర్వాత మాధవ, శర్మలు- చాలా అరుదుగా ఆదిత్య ఇంటికి వచ్చేవారు. పబ్‌లో డ్యాన్స్ చేసిన ఫిగర్ రమ్యేనన్న రహస్యం వాళ్లిద్దరి మధ్యలోనే ఉండిపోయింది..

*